క్లుప్తంగా

24న జిల్లా మత్స్య సహకార సంఘానికి ఎన్నిక

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 24వ తేదీన జిల్లా మత్స్య సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈమేరకు ఎన్నికల అధికారి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, 19న ఉదయం 10 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుంది. 24న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఈ ప్రక్రియ మచిలీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరాసుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి డిసెంబరు 8వ తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల కుటుంబ సభ్యుల సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలన్నారు. ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు అర్హులైన విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ఆమె కోరారు.

సాగర సంగమ ప్రాంతం పరిశీలన

కోడూరు: హంసలదీవిలోని సాగరసంగమ ప్రాంతాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనలతో కూటమి నేతలు మంగళవారం పరిశీలించారు. ఇటీవల కృష్ణానదికి విడుదల చేసిన భారీ వరద మొత్తం హంసలదీవి వద్దే సముద్రంలో కలవడంతో ఆ ప్రాంత పరిస్థితిపై నేతలు ఆరా తీశారు. వరద, సముద్ర పోటు కారణంగా సంగమం వద్ద ఉన్న కృష్ణమ్మ విగ్రహం, పాదాలు దెబ్బతిన్నట్లు నేతలు గుర్తించారు. కృష్ణమ్మ విగ్రహాన్ని, పాదాలను శుభ్రం చేసి పూలమాలలు వేశారు. పాలకాయతిప్ప బీచ్, సాగరసంగమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, పర్యాటకులకు వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కూటమి నేతలు చెప్పారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మర్రే గంగయ్య, పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ పూతబోయిన కరుణకుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు, తదితరులు పరిశీలించిన వారిలో ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి



కోడూరు: స్థానిక వైఎస్సార్ సీపీ నేత పోతుల నరేష్ తండ్రి శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసరావు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడూరు, అవనిగడ్డ జెడ్పీటీసీలు యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెంలో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసినట్లు గ్రామ సర్పంచ్ కోసూరు అనూష తెలిపారు. ఇటీవల వచ్చిన వర్షాలకు గ్రామంలో అంటువ్యాధులు ప్రబల కుండా ముందస్తుగా ఫాగింగ్ చేయించామని తెలిపారు. మురుగు కుంటలు, డ్రెయినేజీల వెంట సున్నం, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు వివరించారు. గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటమునిగిన పంట పొలాల పరిశీలన

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామ పరిధిలో నీట మునిగిన వరి పంట పొలాలను మంగళవారం పలువురు వ్యవసాయ శాఖ సైంటిస్టులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పొలాల్లో నిలిచిన నీరు తొలగించి అనంతరం పంట కాపాడటానికి పలు రకాల మందులను సూచించారు. ఈ పర్యటనలో సైంటిస్ట్‌లు డాక్టరు కె.నాగేంద్రం, డాక్టరు ఎం. గిరిజారాణి, డాక్టరు పి.శ్రీలత, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టరు లహరి, ఏడీఏ జి.శివరామకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు. అయితే సైంటిస్టులు మండలం అంతా పర్యటించకుండా ఒక గ్రామం చూచి వెళ్లిపోవడం విమర్శలకు దారితీస్తోంది. మండలంలో పంట పలు దశల్లో ఉంది. వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దాదాపు 10 రోజులుగా నీటిలో నానుతున్న పంట ఎంత వరకు చేతికి వస్తుంది అన్న విషయాలను పరిశీలించకుండా నీరు పోయిన తర్వాత ఉపయోగించాల్సిన మందులను సూచించడం విడ్డూరంగా ఉందని పలువురు రైతులు పెదవి విరుస్తున్నారు. సైంటిస్ట్‌ల పర్యటన మొక్కుబడిగా జరిగిందంటూ రైతులు విమర్శిస్తున్నారు.

విద్యుత్ సిబ్బంది పనితీరు అభినందనీయం

కలెక్టర్ డీకే బాలాజీ



ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావును సన్మానించి మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: వరద, వర్షాల సమయంలో జిల్లాలో విద్యుత్ సిబ్బంది పనితీరు అభినందనీయమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఉదయపునడక మిత్రమండలి భవనంలో ఆంధ్రప్రదేశ్ యోగా సభ నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ కో-ఆర్డినేటర్, మచిలీపట్నం డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావును కలెక్టర్ సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే కొద్దిసేపు కూడా గడపలేని పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఉన్నారన్నారు. అందువల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఆశాఖ సిబ్బంది ఎంతో చాకచక్యంగా పనిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా వరదల్లో, వర్షాల్లో సైతం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించిన సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది ఎంతో చాకచక్యంగా రెయిన్ జాకెట్లు వినియోగించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. సాధారణంగా నడవలేని ప్రాంతాల్లో సైతం విద్యుత్ సిబ్బంది ముందుకెళ్లి కష్టపడి సమస్యను పరిష్కరిస్తున్నారన్నారు. లైన్లు తెగితే చాకచక్యంగా తీగలతో పునరుద్ధరించే పనులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేస్తున్న సిబ్బందికి ఈఈ భాస్కరరావు ద్వారా అభినందనలు తెలుపుతున్నానని కలెక్టర్ అన్నారు. అనంతరం యోగా సభ నిర్వాహకులు కలెక్టర్ డీకే బాలాజీ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా యోగాగురువు గురునాథ్‌బాబు, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ఎం. వెంకటేశ్వరప్రసాద్, ముదిగొండశాస్త్రిలను కలెక్టర్ సత్కరించారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించండి

బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్

చిలకలపూడి(మచిలీపట్నం): గణపతి నవరాత్రోత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్ అన్నారు. నగరంలోని సిరి కల్యాణ మండపంలో గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకున్న కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఊరేగింపులు, ఉత్సవాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. మండపంలో హుండీలు, విలువైన వస్తువులు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర మతాల వారి ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించకూడదన్నారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించటం, శాంతి, భద్రతలకు విఘాతం కలిగించకూడదన్నారు. సీఐలు కె ఏసుబాబు, పరమేశ్వరరావు, అబ్దుల్ నబీ, ఎస్సైలు ప్రభాకర్, శ్రీనివాస్, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత



బందోబస్తు నిర్వహిస్తున్న స్పెషల్ పోలీసులు

గూడూరు: మండలంలోని కప్పలదొడ్డిలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాపుల వీధిలో గణపతి నిమజ్జనం సోమవారం నిర్వహించారు.భారీ ఊరేగిపుగా డీజే వాయిద్యాలు, డిస్కో లైటింగ్‌లతో యువకులు నృత్యాలు చేస్తూ వెళ్లారు. పెడన రోడ్డు కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర ఒక వర్గం వారు ఊరేగింపులో డీజే పాటలపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. బందరు రూరల్ సీఐ కె.నాగేంద్రప్రసాద్ పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు. మంగళవారం పలు నిమజ్జనాలు జరుగుతుండటంతో ముందస్తు చర్యగా స్పెషల్ పోలీస్ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెడన: వినాయకుని నిమజ్జనం ఊరేగింపులో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి సేకరించిన, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రహ్మపురం ప్రధాన రహదారిలో ఎదు రెదురుగా వచ్చిన పెడన, మచిలీపట్నం డీజే నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇది పందిళ్ల నిర్వాహకుల వరకు పోవడంతో ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. పోలీ సులు రావడంతో ఇరువర్గాల వారు జారుకున్నారు. విచారణ చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

ముగిసిన ‘ఉపాధి’ సామాజిక తనిఖీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ సూర్యనారాయణ

బంటుమిల్లి: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సుమారు రూ.6 కోట్ల విలువ చేసే పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) మంగళవారంతో ముగిసింది. గత పది రోజులుగా సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో నిర్వహించిన సర్వే అనంతరం తమ పరిశీలన నివేదికలను సమర్పించారు. మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ నివేదిక కార్యక్రమాన్ని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక తనిఖీ బృందం సమర్పించిన నివేదికల ఆధారంగా విచారణ జరిపారు. ఆయన పలువురు అధికారులకు రూ.65 వేల రికవరీ రాశారు. ఉపాధి పథకంలో చేసిన పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టడంలో సిబ్బంది అలసత్వం వహించడంతోపాటు డబ్బులు డ్రా చేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని లేకపోతే రికవరీ చేస్తామని పీడీ హెచ్చరించారు. ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఏపీడీ ఏఎన్‌వీ నాంచారరావు, అంబుడ్ పర్సన్ కె.శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఎన్.సురేష్, ఎస్ఆర్‌పీ సీహెచ్.సత్యన్నారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డీఆర్‌పీలు, ఎఫ్ఏలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పిరమిడ్ క్షేత్రానికి మొక్కల పంపిణీ

కోడూరు: మండలంలోని జయపురం గ్రామంలో ఉన్న ఆదిసూర్యనారాయణ పిరమిడ్ ధ్యాన క్షేత్రానికి ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు కాశీబొట్ల నాగభూషణం మొక్కలను అందజేశారు. ధ్యాన క్షేత్ర రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను ధ్యాన క్షేత్ర నిర్వాహకురాలు పిన్నమనేని పుష్కలతకు ఇచ్చారు. పిల్లలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించి ప్రతి ఇంటిలో నాటాలని గత 15 రోజులుగా మొక్కలను అందజేస్తున్నారు.

మట్టిలో కలిసిపోయిన పంటలు



బొబ్బర్లంక(మోపిదేవి): ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా మండలంలోని బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, మోపిదేవి వార్పు వద్ద వాణిజ్య పంటలు ముఖ్యంగా పసుపు, కంద, అరటి వంటితోటలు పూర్తిగా వరదల్లో మునిగిపోయాయి. ఐదు రోజులపాటు వరదనీటిలోనే ఉండటంతో మొక్కలు పూర్తిగా చచ్చిపోయినట్లు రైతులు వాపోయారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి నిండా మునిగిపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

పశుపోషకులకు సాయం

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ పల్లెపాలెంలో పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ పశుపోషకులకు వరిగడ్డి కట్టలు అందించారు. ఇటీవల వచ్చిన వరదలకు వరిగడ్డి వాములు కొట్టుకుపోవడం, వరదనీటిలో మునిగి కుళ్లి పోవడం వల్ల పశుగ్రాసానికి తీవ్ర కొరత వచ్చింది. విషయం తెలుసుకున్న విక్కుర్తి 150 వరిగడ్డి కట్టలను పశు పోషకులకు అందించారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, పున్నయ్య చౌదరి, పులిగడ్డ చంద్ర, మాజీ సర్పంచ్ దాసి హాజిబాబు, చెన్ను సాయి ప్రసాద్, బర్మా శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. విద్యార్థుల శారీరక దారుఢ్య పరీక్షల ఆధారంగా మొత్తం 30 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ 16 ఆంధ్రా బెటాలియన్ హవాల్‌దార్ రాజ్‌సింగ్, నాయక్ అమిత్ శర్మ పాల్గొని ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన క్యాడెట్లకు వచ్చే వారం నుంచి రెండేళ్ల పాటు శిక్షణ ఉంటుందని పాఠశాల హెచ్ఎం యూవీ కృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో ఈ శిక్షణను పూర్తి చేసుకోవాలని పాఠశాల ఎన్‌సీసీ అధికారి అప్పినేడి వెంకటరామాంజనేయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీలు రమేష్‌కుమార్, శివ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కోడూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయలుగా అవార్డులు అందుకున్న మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను డెమోక్రటిక్ పీఆర్‌టీయూ నేతలు ఘనంగా సన్మానించారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు నందిగం పోతురాజు, రేపల్లె నిరంజన్‌లను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. సంఘ మండలాధ్యక్షుడు అప్పికట్ల సాంబశివయ్య ఆధ్వర్యంలో ఈ సన్మానం జరగింది. అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకొని పని చేయాలని ఎంఈఓ రాందాసు అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి జరుగు నరసింహారావు, సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెన్ను: గాంధీనగరంలో రూ.27 వేలకు దక్కించుకున్న లడ్డుతో..



పెడనలో నిమజ్జనానికి ఊరేగింపుగా ట్రాక్టర్లపై బయల్దేరిన గణనాథులు



మోపిదేవి గౌడపాలెం రామాలయం వద్ద గణేశుని విగ్రహం..



నాగాయలంకలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అనుదీప్, భాగ్యలక్ష్మి దంపతులు



మోపిదేవి ప్రధాన వీధుల్లో ఊరేగుతున్న గణనాథుడు



పెడన బస్టాండు సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద భక్తులు



పెడన బ్రహ్మపురంలో నిమజ్జనానికి బయల్దేరిన లంబోదరుడు



పెడన కొత్తపేటలో నిమజ్జనం ముందు యువత నృత్యాలు



మచిలీపట్నం టౌన్ ఈడేపల్లి శక్తిగుడి సమీపంలో గుహ సెట్టింగ్‌లో గణనాథుడు



మచిలీపట్నం టౌన్ రాజుపేట సాతాను బజారులో 20 అడుగుల మట్టిగణపతి



కోడూరులో పూజలందుకున్న గణనాథుడు

జై జై గణేశా...బై బై గణేశా

మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం గణేష్ నవరాత్రులు నాలుగో రోజుకు చేరాయి. ఉదయం, రాత్రి సమయాల్లో లంబోధరుడి ఎదుట దంపతులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. సోమవారం మూడో రోజుతో కొందరు తమ పందిళ్లలో వినాయకుని ప్రతిమలను కదిపి మంగళవారం నిమజ్జనానికి తరలించారు. యువత కేరింతలు, నృత్యాలు, డప్పువాయిద్యాలతో పంట కాలువలకు తరలి వెళ్లారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

–మచిలీపట్నం టౌన్/పెడన/కృత్తివెన్ను/నాగాయలంక/మోపిదేవి

పబ్లిసిటీ తప్ప చేసిందేమీ లేదు

- సహాయక చర్యల్లో వైఫల్యం చెందామని సీఎం ఒప్పుకున్నారు
- వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



చిలకలపూడి(మచిలీపట్నం): విజయవాడ నగరంలో వరద బాధితులను ఆదుకుంటున్నామని పబ్లిసిటీ తప్ప వారికి ఏ మాత్రం సహాయం అందించలేదని మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. విజయవాడలో వరద పరిస్థితి, బాధితులకు ప్రభుత్వ సహాయ చర్యల తీరుపై ఆయన మంగళవారం మాట్లాడారు. అందరికీ నూరుశాతం సహాయం అందించామని చెప్పుకుంటున్న వారు కనీసం 50 శాతం మందికి కూడా సహాయం అందించలేకపోయారన్నారు. సహాయం చేయటంలో మేము వైఫల్యం చెందామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఒప్పుకున్నారన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన మంత్రులు ఉండి కూడా విజయవాడను సాధారణ పరిస్థితికి తీసుకురాలేకపోయారన్నారు. గత నెల 28, 29 తేదీల్లో భారీ వర్షాలు ఉన్నాయని, వరద ముంపు ఉందని ఆయా అధికారులు చెప్పినప్పటికీ ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తిన తరువాత వచ్చి బోటు షికార్లు చేశారన్నారు. ప్రధాన రహదారులు తప్ప మారుమూల ప్రాంతాలకు ఎవరూ వెళ్లలేదన్నారు. అక్కడి ప్రజలను ఎవరూ పట్టించుకోకపోవటంతో ఆకలితో అలమటించిపోయారన్నారు. ప్రజల కష్టాలు తీర్చాలన్నా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఏ విధంగా ప్రజలను ఆదుకోవాలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే తెలుసునన్నారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు వరద బాధితులకు సహాయం అందించటంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. కావాల్సింది అనుభవం కాదని, ప్రజలకు మేలు చేయాలనే గుణం ఉండాలన్నారు. అటువంటి మనసున్న వ్యక్తి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనని ఆయన స్పష్టం చేశారు. వరద బాధితుల కోసం తాను ఇక్కడే ఉండి పనిచేస్తున్నానని చెప్పుకుంటున్న చంద్రబాబు పూర్తిగా వైఫల్యం చెందారని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల నివేదన



పెదకళ్లేపల్లి కృష్ణానది ఒడ్డున చప్టా నిర్మించాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను కోరుతున్న గ్రామస్తులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి, మెంతిదిబ్బ ప్రాంతాల్లో వరి పంట పరిశీలించి రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదలకు మంగళవాని సింక్ డ్రెయినేజీ ఎగదట్టడంతో వర్షపు నీరు పొలాల్లోకి ప్రవహించడంతో పాటు ముంపునీరు చేరి పంటలు బాగా నష్టపోయామని రైతులు వివరించారు. పెదకళ్లేపల్లి కృష్ణా ఘాట్ వద్ద అంత్యక్రియలు చేసే ప్రదేశంలో చప్టా కింద మట్టి కొట్టుకు పోవడంతో చప్టా నదిలోకి ఒరిగిపోయిందని రివిట్‌మెంట్ నిర్మించాలని కోరారు. గ్రామంలో మంచినీటి చెరువుచుట్టూ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఇటీవల గ్రామంలో అనారోగ్యంతో రాజనాల ప్రసాద్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తలుపుల జయలక్ష్మి అనారోగ్యానికి గురై కోలుకోవడంతో ఆమెను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, జనసేన, టీడీపీ నాయకులు బాదర్ల లోలాక్షు నాయుడు, గోళ్ల శ్రీనివాసరావు, అరజా కిరణ్ కాంత్, గొర్రెపాటి నాగేశ్వరావు, అరజా రాధిక, అరజా నాని తదితరుల పాల్గొన్నారు.

డ్రెయిన్ల సమస్య పరిష్కారానికి చర్యలు

చల్లపల్లి(అవనిగడ్డ)/ఘంటసాల: చల్లపల్లి మండల పరిధిలోని పలు డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మండల పరిధిలోని మంగళాపురం, ఘంటసాల మండలంలోని లంకపల్లి, పూషడం, యండకుదురు, జీలగడలగండి ప్రాంతాల్లో మంగళవారం డ్రెయిన్లను పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, డీసీ మాజీ చైర్మన్ నిడమానూరు దిలీప్‌కుమార్, పలువురు అధికారులు, పలు పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఘంటసాల మండలంలో తహసీల్దార్ బి.విజయ్‌ప్రసాద్, ఏవో కె.మురళీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, ప్రధాన కార్యదర్శి పరిశే చలపతి, నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విశ్వనాథపల్లిలో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

కోడూరు: వరద బాధితులను ఆదుకొనేందుకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విరాళాల సేకరణను ప్రారంభించారు. మంగళవారం మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చిన్నారులు వరద తీవ్రతను అక్కడ జరిగిన నష్టాన్ని వివరించి విరాళాలను సేకరించారు. విరాళాల నగదుతో బాధితులకు సహాయం అందించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలో విరాళాలు సేకరించాలని ఎంఈఓలు రామదాసు, శ్రీనివాసరావు ఇప్పటికే హెచ్ఎంలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. హెచ్ఎం రవివర్మ, ఉపాధ్యాయుడు రాంబాబు, సాంబశివయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: విజయవాడ పట్టణానికి చెందిన వరద బాధితుల సహాయార్థం రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిధులు సేకరించారు. విజయవాడ పట్టణంలో పలు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు కట్టుబట్టలతో మిగిలిన నేపథ్యంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.16,580 సేకరించి విజయవాడ సీపీఎం ద్వారా బాధితులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కె.మురళిమోహన్, నాయకులు బి. నాగరాజు, పి.వెంకన్న, ఎల్.అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గూడూరు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని పోలవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

‘ఆక్వా’ నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో వరద ముంపుకు గురైన చెరువులను శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నంచి నష్టపోయిన వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదలకు నియోజకవర్గంలో మొత్తం 4,055 ఎకరాల్లో ఆక్వా సాగుకు నష్టం జరిగిందన్నారు. 126 బోట్లు, 520 వలలు దెబ్బతిన్నట్లు తెలిపారు. అత్యధికంగా నాగాయలంక మండలంలో 1,445 ఎకరాల చెరువులు, 51 బోట్లు, 408 వలలకు నష్టం కలిగిందన్నారు. అవనిగడ్డ మండలంలో 37.68 ఎకరాల చెరువులు, 74 బోట్లు, 111 వలలు, కోడూరు మండలంలో 2,294 ఎకరాల చెరువులు, ఒక బోటు, ఒక వల, రెండు కేజెస్, మోపిదేవి మండలంలో 271.41 ఎకరాల చెరువులు, చల్లపల్లి మండలంలో 7.1 ఎకరాల చెరువులు, ఒక హేచరీకి నష్టం వాటిల్లిందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో ఆక్వారంగానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని స్పష్టంచేశారు. వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, నాగేశ్వరావు ఉన్నారు.

నష్టం నమోదు పూర్తయిందనడం దారుణం

పెడన: భారీ వర్షాలకు, ఇసుక పర్ర డ్రెయిన్, ఇతర డ్రెయిన్లకు గండ్లు పడిన కారణంగా మండలంలో చాలా గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందని, వ్యవసాయశాఖ అరకొరగా నష్టం నమోదు చేశారంటు వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమలాపురం వీఏఏ ఏను చెన్నూరుకు ఇన్‌చార్జిగా వేయడం, మండల స్థాయిలో పర్యవేక్షణ పూర్తిగా కొరవడిన కారణంగా అంతంత మాత్రంగానే పంట నష్టం నమోదు చేశారని అన్నారు. కొందరు రైతులు తమ పంట నష్టపోయిందని చెబుతుంటే వ్యవసాయశాఖ సిబ్బంది నమోదు పూర్తయిపోయిందని అంటున్నారని అన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి పంట నమోదు ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలని ఆయన కోరారు.